నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 30 డిసెంబర్ 2024 | KARIMNAGAR

# ఒంటికి వస్తే బయటికే!

- పెగడపల్లి జడ్పీ పాఠశాలలో మూలన పడ్డ మూత్రశాలలు
- విద్యార్థులు, టీచర్లకు తప్పని అవస్థలు
- కొత్త వాటి నిర్మాణానికి నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



పెగడపల్లి జడ్పీ పాఠశాల



జడ్పీ పాఠశాలలో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు

పెగడపల్లి, డిసెంబర్ 29 : పెగడపల్లి జడ్పీ పాఠశాలలో మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. దాదాపు 30 ఏళ్ల కింద నిర్మించిన టాయిలెట్స్ లోతు ప్రదేశంలో ఉండడం వల్ల అందులో మట్టి చేరి నీళ్లు వెళ్లే దారి లేక కొన్ని నెలలుగా వాటిని వినియోగించడం లేదు. దీంతో పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులు, 17 మంది ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. కొత్తగా నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం నుంచి ₹5 లక్షల నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. అత్యవసర సమయంలో దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని మూత్రశాలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బాలికలు, మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మూత్రశాలల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం లలిత మాట్లాడుతూ, జూన్‌లో పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన విప్ లక్ష్మణ్‌కుమార్, అప్పటి కలెక్టర్‌కు మహిళా ఉపాధ్యాయులం వినతి పత్రం సమర్పించామని గుర్తు చేశారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరూ స్పందించడం వాపోయారు. అలాగే పీఆర్ డీఈ అశ్విన్ మాట్లాడుతూ, మూత్రశాలల నిర్మాణానికి గత నెలలోనే ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయని, కానీ, టెక్నికల్ సాంక్షన్ రాలేదని చెప్పారు. ఈజీఎస్ కొత్త నిబంధనల ప్రకారం మూత్రశాలల నిర్మాణ పనులకు ₹2 లక్షలకు మించి వినియోగించరాదని తెలిపారు. ₹2 లక్షల చొప్పున 2 పనులకు ఎస్టిమేషన్ మంజూరు కోసం పంపించామని, టెక్నికల్‌గా మంజూరు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

## కూలీలను కుక్కి కుక్కి



ట్రాలీలో పరిమితికి మించి వెళ్తున్న ప్రయాణికులు

ముత్తారం, డిసెంబర్ 29: ప్రమాదమని తెలిసినా ఆటో ట్రాలీ డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తున్నారు. ప్రస్తుతం పల్లెల్లో యాసంగి పనులు ముమ్మరం కాగా, నాటు వేసేందుకు అవసరమైన కూలీలను తీసుకువచ్చేందుకు కొన్ని సీడ్ కంపెనీలు ట్రాలీ ఆటోలను ఏర్పాటు చేశాయి. అయితే ప్రమాదమని తెలిసినా 20 మంది వెళ్లే ట్రాలీలో 40 మందిని తరలిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆదివారం ముత్తారం మెయిన్‌రోడ్‌లో పరిమితికి మించి ఇలా కూలీలను తరలించారు.

# ఇసుకాసురులకు అండ!

- రెవెన్యూ, పోలీస్ శాఖల మధ్య సమన్వయ లోపం
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- దోషుల ముందే దొంగ పత్రాల సృష్టి?
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న మాఫియా
- భయం వీడి బాజాప్తా దందా
- కలకలం సృష్టించిన 'నమస్తే' కథనం
- జమ్మికుంట కేంద్రంగా కదులుతున్న డొంక
- చర్చనీయాంశమైన అధికారుల తీరు



**సాధారణంగా దోషులను శిక్షించడానికి చట్ట ప్రకారం అధికారులు చర్యలు తీసుకుంటారు. కానీ ఇసుక అక్రమ రవాణాలో మాత్రం ఆ దోషుల ముందే తప్పటడుగులు వేస్తున్నారు. వారే సాక్ష్యంగా తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారు. ఇసుక వేలం వేయకుండానే వేసినట్టు పేపర్‌పై చూపుతున్నారు. ₹5వేల ఆదాయం వచ్చినట్టు చలానాను ఏకంగా కోర్టులో సమర్పిస్తూ పక్కదారి పట్టిస్తున్నారు. ఇదంతా ఎక్కడో కాదు, జమ్మికుంట కేంద్రంగా నడుస్తున్న ఇసుక బాగోతం! దోషుల ముందే అధికారులు తప్పుడు పద్ధతులు పాటిస్తుండడంతో ఇదే అదనుగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయలోపాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. అక్రమ రవాణాదారులు మరోసారి తప్పు చేసినా.. చర్యలు తీసుకునే అధికారాన్ని కోల్పోయే పరిస్థితులు కొంత మంది అధికారులే సృష్టిస్తున్న వైనం విమర్శలకు తావిస్తున్నది. జమ్మికుంట కేంద్రంగా సాగుతున్న ఇసుక అక్రమ దందాపై 'పట్టుకున్న ఇసుక మాయం?' శీర్షికన ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం అధికార వర్గాల్లో కలకలం సృష్టించింది. ఈ వ్యవహారంపై తీగలాగితే డొంకంతా కదులుతుండగా, అక్రమార్కుల ముందే అధికారులు తప్పులు చేస్తున్న వైనం చర్చనీయాంశంగా మారింది.**

కరీంనగర్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ జమ్మికుంట : జమ్మికుంట మండల కేంద్ర పరీవాహక ప్రాంతాన్ని ఆనుకొని వెళ్తున్న మానేరు వాగులో నాణ్యమైన ఇసుక లభ్యం అవుతున్నది. నిజానికి ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడి ఇసుకకు డిమాండ్ ఎక్కువ. ఈ నేపథ్యంలో మానేరుకు ఇరువైపు గ్రామాల నుంచి దందా సాగడం సర్వసాధారణమైంది. పోలీసులు, రెవెన్యూ, అప్పుడప్పుడు మైనింగ్ అధికారులు దాడులు చేయడం, పట్టుకోవడం, జరిమానాలు విధించడం.. ఆ తర్వాత మళ్లీ కొద్దిరోజులకు దందా సాగడం ఇక్కడ రివాజుగా మారింది. దీనిని అరికట్టేందుకు జమ్మికుంట పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఇసుక అక్రమ ట్రాక్టర్లను పట్టుకొని, అదుపులోకి తీసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో సుమారు 90 ఇసుక అక్రమ ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిపై నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదుచేసి, కోర్టుకు పంపించారు. అయితే ఇసుక అక్రమ ట్రాక్టర్ల విషయంలో పోలీసులు రెండు రకాలుగా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందని నిబంధనలు చెబుతున్నాయి. అందులో మొదటిది ఇసుక అక్రమ ట్రాక్టర్లను పట్టుకొని, వాటిని సంబంధిత తహసీల్దార్‌కు అప్పగిస్తారు. ఆ మేరకు తహసీల్దార్ మొదటి సారి పట్టుబడితే సదరు ట్రాక్టర్‌కు ₹5వేల జరిమానా విధిస్తారు. అదే రెండోసారి పట్టుబడితే ₹10వేల జరిమానా వేయాలి. మూడోసారి అయితే ఏకంగా సీజ్ చేయాలి. తహసీల్దార్లు ఆ మొత్తాన్ని చలానా రూపంలో కట్టించి, ఆ డబ్బులను ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తారు. అలాగే పట్టుబడిన ఇసుకను అన్‌లోడింగ్ చేసి, వేలం వేస్తారు. దాదాపు ఒక క్యూబిక్ మీటర్‌కు ₹600 చొప్పున ట్రాక్టర్ ఇసుకకు సుమారు ₹1800 వచ్చేలా చర్యలు తీసుకుంటారు. అలా వచ్చిన సొమ్మును సైతం ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తారు. జరిమానా చెల్లించిన తర్వాత రెవెన్యూ అధికారులు సదరు ట్రాక్టర్లను విడుదల చేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే జరుగుతున్నది. ఇక రెండో పద్ధతి చూస్తే పోలీసులు ఇసుక అక్రమ ట్రాక్టర్లను పట్టుకొని నేరుగా ఎఫ్ఐఆర్ చేసి కోర్టుకు పంపిస్తారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. ఇప్పుడు జమ్మికుంట పోలీసులు ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. కానీ, ఇక్కడే రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మధ్య సమన్వయలోపం ఇసుకాసురులకు కలిసి వస్తున్నది.

### దోషుల ముందే తప్పుడు పత్రాల సృష్టి?

సుమారు 90 అక్రమ ఇసుక ట్రాక్టర్లను జమ్మికుంట పోలీసులు పట్టుకున్నారు. ఆ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపించారు. దాంతో కోర్టు పలు ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తే.. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌ను తహసీల్దార్ పరిగణలోకి తీసుకొని, ఆ ఇసుకను డంప్ చేసి, దానికి వేలం వేసి, వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలి. అందుకు సంబంధించిన చలానాను కోర్టులో సమర్పించాలి. ఉత్తర్వుల్లో ఈ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. కానీ, జమ్మికుంటలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఇసుక ట్రాక్టర్ తహసీల్ ఆఫీస్‌కు వెళ్లాల్సి ఉన్నా వెళ్లడం లేదు. ఇసుక డంప్ కావడం లేదు. అధికారికంగా వేలం జరగడం లేదు కానీ, జరిగినట్టు రెవెన్యూ వ్యవస్థ నుంచి రికార్డులు సృష్టించబడుతున్నాయి. దీని వెనుక పెద్ద తతంగమే నడుస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుబడిన దోషి ముందే అధికారులు తప్పుడు పద్ధతులకు పాల్పడుతున్నారు. ఆ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు, ఇసుకను వేలం వేసినట్టు, అందుకు ₹5వేల ఆదాయం వచ్చినట్టు చూపుతూ చలానా కోర్టుకు సమర్పిస్తున్నారు. ఇదంతా కాగితాలపై నడుపుతున్నారే తప్ప నిజానికి ఇక్కడ ఏ నిబంధనలు అమలు కావడం లేదు.

### కాగితాలపైనే వేలం!

వేలం వేసేందుకు కొన్ని నిబంధనలున్నాయి. ఇసుక వేలం వేయాలంటే ముందుగా పత్రిక ప్రకటన ఇవ్వాలి. అందుకు సంబంధించిన ఫొటోలను జాగ్రత్త పరచాలి. ఎవరి పర్యవేక్షణలో వేలం జరిగిందో చూపెట్టాలి. కానీ, అందులో ఏ ఒక్క నిబంధన అమలు కావడం లేదు. అయితే పేపర్‌పై మాత్రం అన్నీ పాటిస్తున్నట్టు పత్రాలు సృష్టిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే ఇసుక అక్రమ రవాణాదారు ముందే ఈ తప్పుడు పద్ధతులను అధికారులు చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా సదరు ఇసుకను అదే ట్రాక్టర్ యజమానికి లేదా అతడి దగ్గరి వారికి వేలం ద్వారా అమ్మినట్టు చూపి, అతడి ద్వారా ₹5వేల చలానా కట్టించి, దానిని కోర్టుకు సమర్పించి స్టేషన్ నుంచి ట్రాక్టర్లను తీసుకెళ్తున్నారు. అంటే పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వెళ్తున్న ట్రాక్టర్లలో ఇసుక అలాగే ఉంటుంది. వారు ఎక్కడో ఓచోట అమ్ముకుంటున్నారు. పట్టుకున్న ట్రాక్టర్ల న్నీ ఇసుకతో పోలీసుల కండ్ల ముందు నుంచే బయటకు వెళ్తున్నాయి. జరుగుతున్న తతంగాన్ని నిశితంగా పరిశీలిస్తే.. రెవె న్యూ, పోలీస్ అధికారులు సమన్వయలోపంతో తీసుకుంటున్న చర్యలు ఇసుక అక్రమ రవాణాదారులకు అండగా నిలుస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీనిని లోతుగా చూస్తే.. అధికారులు గుట్టుగా ఎలా అండగా నిలుస్తున్నారో అర్థమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైకిచూస్తే అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు కనిపిస్తున్నా.. లోలోపల మాత్రం పెద్ద బాగోతమే నడుస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపితే భవిష్యత్‌లో ఇటువంటి పరిణామాలు చోటుచేసుకోకుండా ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### శాఖల మధ్య లోపం!

అధికారులు అనుసరిస్తున్న తప్పుడు పద్ధతుల వల్లే ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా చేసుకునే అవకాశం దోషులకు ఉంటున్నదన్న విమర్శలున్నాయి. ఎందుకంటే వారి ముందే తప్పుడు నివేదికలు తయారు చేస్తున్న నేపథ్యంలో పోలీసులన్నా.. రెవెన్యూ అధికారులన్నా భయం ఉండడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే కోర్టు ఉత్తర్వులు ప్రకారం రెవెన్యూ అధికారులు విధిగా ట్రాక్టర్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని ఇసుక వేలం వేయాలి. ఇదే సమయంలో పోలీసులు సహకరించాలి. కానీ, ఈ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయం లోపించిందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ట్రాక్టర్ పట్టుబడితే పెద్దగా పోయేదేముంది? ₹5వేల చలానా కడితే చాలన్న అభిప్రాయమే ఇసుకాసురుల్లో ఉందని తెలుస్తున్నది. ఇప్పటికైనా రెండు శాఖలు ఒక్క తాటిపైకి వచ్చి, నిబంధనలకు అనుగుణంగా ముందుకెళ్తే ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే అవకాశముంటుంది. అయితే తమ కార్యాలయానికి ఇసుక ట్రాక్టర్లును పోలీసులు పంపడం లేదని, చలానా వస్తే తీసుకుంటున్నామని తహసీల్దార్ రమేశ్‌బాబు ధ్రువీకరించిన విషయం తెలిసిందే.

### తహసీల్దార్ మమ్మల్ని అడగలేదు : జమ్మికుంట సీఐ రవి

జమ్మికుంట కేంద్రంగా జరుగుతున్న ఇసుక దందాపై జమ్మికుంట సీఐ రవి స్పందించారు. ఆదివారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. 'మేం పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి పంపాలని జమ్మికుంట తహసీల్దార్ మమ్మల్ని కోరలేదు. అయన అడిగితే పంపేవాళ్లం. కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతున్నాం. దీని వల్ల భవిష్యత్‌లో వారికి శిక్ష పడే అవకాశముంటుంది. తద్వారా వారు భయపడి అక్రమ దందా మానుకుంటారన్న ఉద్దేశంతో ఈ తరహా చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు. అలాగే ప్రభుత్వానికి అధిక ఆదాయం వచ్చేలా ₹5వేల చలానా కట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## మోడీ బీసీలకు అన్యాయం చేసిండు

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత రాజారామ్ యాదవ్



మాట్లాడుతున్న రాజారాం యాదవ్

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 29: ఈబీసీ రిజర్వేషన్లతో ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని బీసీలకు అన్యాయం చేశారని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత రాజారామ్ యాదవ్ విమర్శించారు. కుల, మతాల పేరుతో రిజర్వేషన్లు కల్పిస్తున్న పాలకులు, సమాజంలో 50శాతానికి పైగా ఉన్న వెనుకబడిన కులాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజంలో సింహభాగం ఉన్న వెనుకబడిన తరగతులను మరింత దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకునేందుకు మరో పోరాటానికి బీసీలంతా కలిసికట్టుగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కృషి భవన్‌లో బీసీ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశ సంపద సృష్టిలో వృత్తి కులాల పాత్ర ఇతోధికమని తెలిసినా, ఆ కులాలను అణిచి వేస్తున్న ఘనత అగ్ర కుల నేతల కనుసన్నల్లో పాలన సాగిస్తున్న కాంగ్రెస్, బీజేపీలకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ నిరుద్యోగుల వెన్ను విరుస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి జీవో నం.29 తెచ్చి వారి భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. 'మేమెంతో మాకంత' అనే నినాదంతో ముందడుగేస్తూ బీసీలంతా సంఘటిత శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు తుల ఉమ మాట్లాడుతూ, బీసీలు ప్రశ్నించే స్థాయికి ఎదగడం హర్షించదగ్గ పరిణామమన్నారు. అన్ని పార్టీల వెన్నులో వణుకు మొదలైందని, అగ్రనేతలు బీసీల గురించి మాట్లాడాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంట రాములు యాదవ్ మాట్లాడుతూ, బీసీ ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. బీసీ నాయకత్వం ఎదిగి వచ్చినా పార్టీలు టికెట్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల విజయకుమార్, బీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు మర్రి శ్రీనివాస్ యాదవ్, సీనియర్ అడ్వకేట్ రాజన్న యాదవ్, పాంచాల సత్యనారాయణ, ప్రభాకర్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోట రాములుయావ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి అతాపటేల్, బీసీ సంఘం నాయకురాలు పావని, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఒగ్గు కళాకారుడు పోతుగంటి శ్రీనివాస్ గౌడ్ నూటొక్కదీపాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

## డిమాండ్లు నెరవేర్చాలి

20వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్ష



దీక్షలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 29: తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని, ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు కోరారు. కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన నిరవదిక సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. కాగా, దీక్షకు తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహస్వామి, తెలంగాణ టీచర్స్ యూనియన్ 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా, మండల నాయకులు, పీఆర్‌టీయూ టీఎస్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముస్కు తిరుపతి రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కరుణాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, పూర్వ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు, తెలంగాణ సమగ్ర శిక్ష రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ సంఘీభావం తెలిపారు.

# సివిల్ సప్లయిస్‌లో సమ్మె సైరన్!

- జనవరి ఒకటి నుంచి హమాలీల సమ్మెబాట
- పెంచిన కూలీ అమలు కోసం ఆందోళనబాట
- రేపటిలోగా జీవో ఇవ్వకపోతే ఎల్లుండి నుంచి నిరవధిక దీక్షలు
- సమ్మెకు వెళ్తే పౌర సరఫరాలపై ప్రభావం

**సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో సమ్మె సైరన్ మోగబోతున్నది. మూడు నెలల క్రితం కూలీ పెంచుతామని ఒప్పందం జరిగినా.. నేటికీ అమలు చేయకపోవడంతో కార్మికలోకం ఆందోళనబాట పడుతున్నది. అందుకు సంబంధించి ప్రభుత్వం రేపటిలోగా జీవో ఇవ్వకపోతే జనవరి ఒకటి నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఇప్పటికే నోటీస్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళ్తే పౌర సరఫరాలు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.**



సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న హమాలీ కార్మికులు

కరీంనగర్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ నుంచి ప్రతి నెలా ప్రజలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తుంటారు. సివిల్ సప్లయ్స్ గోదాముల్లో హమాలీలు ప్రతి నెలా రెండు దఫాల్లో ఎగుమతి, దిగుమతి విధులు నిర్వర్తిస్తుంటారు. వ్యాగన్లలో వచ్చిన బియ్యాన్ని చౌక ధరల దుకాణాలకు తరలించడంలో కీలకంగా ఉంటారు. గోదాములకు వాచ్‌మెన్లు కూడా పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీరికి రెండేళ్లకోసారి కూలీ పెంచాలి. కానీ, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూలీ రేట్లు పెంచలేదు. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు అనేకసార్లు విజ్ఞప్తులు చేసిన నేపథ్యంలో సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఎదుట రెండు దఫాల్లో చర్చలు నడిచాయి. ఎట్టకేలకు అక్టోబర్ 4న పలు యూనియన్ల సమక్షంలో ఒప్పందాలు కుదిరాయి. అప్పటి వరకు ప్రతి క్వింటాల్‌కు ₹26 కూలీ చెల్లించేది. అదనంగా ₹3 కలిపి ₹29 చెల్లిస్తామని కమిషనర్ అంగీకరించినా.. నేటి వరకు ఈ ఒప్పందాన్ని అమలు చేయలేదు. ఒప్పందం అయిన వెంటనే ఇవ్వాల్సిన జీవోనే ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో హమాలీ కార్మికులు పలు సార్లు విజ్ఞప్తులు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పడుతున్నారు. ఈ నెల 18న కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఒప్పందం ప్రకారం పెంచిన కూలీ రేట్లను అమలు చేయకపోవడంతో జనవరి ఒకటి నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని నోటీస్ కూడా ఇచ్చారు. జిల్లా స్థాయిలో సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ నేతృత్వంలో జిల్లా అధికారులకు సైతం సమ్మె నోటీస్ ఇచ్చారు.

### సమ్మెకు వెళ్తే సేవలకు ఆటంకం

రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా ఒకటి నుంచి 10 వరకు గోదాముల ద్వారా చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. హమాలీలు జనవరి ఒకటి నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తే సంస్థ సేవలకు ఆటంకం ఏర్పడుతుంది. చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా అయ్యే పరిస్థితి ఉండదు. దీంతో రాయితీ బియ్యంపై ఆధారపడిన నిరుపేదలకు పూట గడవడం కష్టంగా మారుతుంది. అంతే కాకుండా ప్రతి నెలా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం అందించే బియ్యం సరఫరా కూడా నిలిచి పోతున్నది. దీంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి వస్తుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్31 వరకు తమకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కూలీ పెంచుతున్నట్టు జీవో విడుదల చేయాలని హమాలీ కార్మికులు ప్రధానంగా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రతి సంవత్సరం రెండు జతల బట్టలు, అందుకు కుట్టుకూలీ కూడా ఇవ్వాలని, ఈఎస్ఐ దవాఖానల్లో వైద్య సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతే కాకుండా గోదాములు అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల భారం పడుతున్నదని, కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలాల్లో పక్కా గోదాములు నిర్మించాలని, రహదారులకు ఆనుకొని ఉన్న స్థలాల్లో పెట్రోల్ బంకులు, గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

### పెంచిన కూలీ అమలు చేయాలి



సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో పనిచేసే హమాలీలకు రెండేళ్లకో సారి కూలీలు పెంచాల్సి ఉంటుంది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఈ సారి అలా చేయకపోవడంతో అనేక సార్లు ధర్నాలు, ఆందోళనలు చేశాం. చివరకు కార్పొరేషన్ కమిషనర్ వద్ద రెండు దఫాలు చర్చలు జరిగాయి. ఇప్పుడు కూలీ ₹26 ఉండగా ₹3 పెంచుతామని ఒప్పుకొన్నారు. అక్టోబర్ 4న జరిగిన ఒప్పందం మేరకు మూడు నెలలుగా ప్రతి క్వింటాల్‌కు ₹29 చెల్లించాలి. కానీ, ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో ఆందోళనబాట పట్టాల్సి వస్తున్నది. ఎన్ని సార్లు చెప్పినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో జనవరి ఒకటి నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని నోటీసు ఇచ్చాం. రేపటిలోగా జీవో ఇస్తే సమ్మె విరమించుకుంటాం. లేదంటే సమ్మె తప్పదు. మా కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 187 గోదాముల పరిధిలోని 3,600 మంది హమాలీలు, నైట్ వాచ్‌మెన్లు, మహిళా హమాలీలు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. అన్ని గోదాముల ఎదుట శిబిరాలు ఏర్పాటు చేసి, ధర్నాలు నిర్వహిస్తాం.

**- టేకుమల్ల సమ్మయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి**

సామూహికంగా కదిలి..

## ₹4.20 లక్షల బిల్లులు కట్టి

- వెల్లుల్లలో ఒకే రోజు వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌చార్జి చెల్లింపు
- ఆదర్శంగా నిలుస్తున్న రైతులు



వెల్లుల్ల రైతు వేదికలో విద్యుత్ సర్వీస్ చార్జిల చెల్లింపు కోసం సమావేశమైన రైతులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 29: వ్యవసాయ విద్యుత్ సర్వీస్ చార్జీల చెల్లింపులో మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్లుగా రైతులందరూ కలిసి ఒకేరోజు చార్జీలు చెల్లిస్తూ వస్తున్నారు. ఆదివారం కూడా వెల్లుల్ల రైతువేదికలో సమావేశమై, వ్యవసాయ పంపుసెట్ల సర్వీస్ చార్జీ చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారు. 2024 సంవత్సరానికి గాను 1,340 పంపుసెట్లకు చెందిన విద్యుత్ సర్వీస్‌చార్జి ₹4.20 లక్షలు చెల్లించాలని తీర్మానించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఎస్ఈ షాలియానాయక్, ఏడీఈ మనోహర్ ఆధ్వర్యంలో రూరల్ ఏఈ అజయ్‌కు సంబంధిత మొత్తాన్ని చెల్లించారు. ఈ సందర్భంగా రైతులను ట్రాన్స్‌కో అధికారులు అభినందించారు. అనంతరం విద్యుత్ ప్రమాదాల నివారణకు రైతులతో 'పొలంబాట' నిర్వహించారు. ప్రధానంగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజ్‌లు వేయద్దని, వ్యవసాయ మోటరుకు ఐరన్‌బాక్సు స్థానంలో ఫైబర్ బాక్సును అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్లు నవీన్, అభినయ్, రమేశ్, సిబ్బంది నరహరి, జలపతి, శివ, రైతు నాయకులు మారు మురళీధర్‌రెడ్డి, రాజరెడ్డి, శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.